తీరని రుణం... రైతుల రణం



రెడ్డికుంట తండా జీపీ, సర్పంచ్ తండాలో రుణమాఫీ కాని రైతులు

విప్‌ల ఊరిలో మాఫీ ప్యాకప్!

- రామచంద్రూనాయక్ తండాలో ఏడుగురికే మాఫీ
- సర్‌'పంచ్' తండాలో 21మందికి కట్
- బీర్ల ఊరిలో రైతులు బొక్కబోర్లా
- 'ఆబి'లోనే అన్నదాతలకు టోకరా

మహబూబాబాద్,ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ)/పెద్దవంగర: కాంగ్రెస్ ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రూనాయక్ సొంత తండాలో కేవలం 28 మంది రైతులు వ్యవసాయ రుణాలు తీసుకుంటే.. మాఫీ అయ్యింది మాత్రం ఏడుగురికే. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రెడ్డి కుంట తండా జీపీ పరిధిలోని సర్పంచ్ తండాలో 30 మంది రైతులు ఉన్నారు. ఇందులో 28 మంది రైతులు రుణాలు తీసుకున్నారు. కొంత మంది రూ.లక్ష, మరికొందరు రూ.రెండు లక్షల లోపు రుణాలు తీసుకున్నారు. వీరిలో ఏడుగురికే రుణ మాఫీ జరిగింది. మిగిలిన 21 మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ తండాలో చాలా ఇండ్లలో భార్యాభర్తలకు ఇద్దరి పేరు మీద పాస్ పుస్తకాలు ఉన్నాయి. రుణమాఫీ నిబంధనల ప్రకారం ఇద్దరిలో ఒకరికి రుణమాఫీ కావాలి. అలా కూడా రుణమాఫీ కాలేదు. మాకు ఎప్పుడు రుణమాఫీ అయితదని రైతులు మొరపెట్టుకుంటున్నారు. ఇదే తండాకు చెందిన జాటోత్ మంగమ్మ అనే మహిళ పాస్ పుస్తకంలో, బ్యాంకు ఖాతాలో, ఆధార్‌కార్డులోనూ పేర్లు సరిగానే ఉన్నాయి. ఈ లెక్కన ఈమెకు రుణ మాఫీ కావాలి.. కానీ కాలేదు. బ్యాంక్, వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి అడిగితే ఈమె ఆధార్ కార్డు నంబర్‌ను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసి చూస్తే జాటోత్ మంగమ్మకు బదులుగా బానోత్ మంగమ్మ అని పేరు చూపిస్తున్నదని చెప్తున్నారు. దీంతో రుణమాఫీ ఆగిపోయింది.

మా ఇంట్లో ఎవరికీ రుణమాఫీ కాలేదు

నాతో పాటు నా భార్య పేరు మీద మొత్తం 12ఎకరాల భూమి ఉంది. తొర్రూరు ఏపీజీవీబీలో ఒకరిపై రూ.1.65లక్షలు, మరొకరిపై రూ.1.70లక్షల రుణం ఉంది..ప్రతి సంవత్సరం రెన్యువల్ చేస్తూనే ఉన్నం. కేసీఆర్ ప్రభుత్వంలో ఇద్దరికి కలిపి రూ.లక్ష రుణమాఫీ అయ్యింది. మళ్లీ పైసలు తీసుకున్నం. కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెయ్యలే. మా కుటుంబంలో ఒక్కరికైనా మాఫీ చేయలేదు.

-జాటోతు దేవా, దుబ్లి దంపతులు, సర్పంచ్ తండా

సైదాపురం.. ఆగమాగం..

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సొంతూరు సైదాపురంలో రుణమాఫీ అందని ద్రాక్షగానే మిగిలింది. మొత్తం 1,008 మంది రైతుల్లో దాదాపు 600 మందికి మాత్రమే రుణ మాఫీ జరిగింది. సర్కారు పెట్టిన అనేక కొర్రీలతోనే రుణమాఫీ జరుగడం లేదు. జాబితాలో ఉన్న వారిలో కొందరికి మాఫీ అవలేదు. దాంతో రైతులు బ్యాంకులు, రైతు వేదికలు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంట్లో ఇద్దరిపేరునా రుణాలు ఉంటే.. రూ.2 లక్షలు దాటిందంటూ పెండింగ్‌లో పెడుతున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు మంచిగా మాఫీ చేశారని, ఈ దఫా అలా లేదని వాపోయారు. సైదాపురం గ్రామంలో ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ నేతలు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. తాము ఓట్లేస్తేనే గెలిచారని, అలాంటిది రుణమాఫీ కాకుంటే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ఏదో ఒకటి తేల్చకుంటే రోడ్డెక్కి ఆందోళన చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

రైతులను మోసం చేస్తున్నరు

మేం బ్యాంకులో లక్షా 60 వేలు వ్యవసాయ రుణం తీసుకున్నాం. ఎప్పటికప్పుడు రెన్యువల్ చేస్తున్నాం. అయినా మాకు మాఫీ కాలేదు. మాకు రేషన్ కార్డు లేదు. రేషన్ కార్డు లేకున్నా రుణ మాఫీ వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పిండు. ఇప్పుడు ఎందుకు మాఫీ చేస్తలేరు.

- బీర్ల మహేశ్, రైతు, సైదాపురం, యాదాద్రి భువనగిరి

ఇది అన్యాయం

నా పేరు మీద బ్యాంకులో లక్ష, భార్య పేరు మీద 70వేలు, కొడుకు పేరు మీద 60 వేలు ఉన్నయి. మొత్తం కలిపి రూ.2.10లక్షలు అవుతున్నదని కాబట్టి మాఫీ కావు అంటున్నరు. ఇది అన్యాయం.

- అచ్చిన వీరయ్య, రైతు, సైదాపురం, యాదాద్రి భువనగిరి

ఆది శ్రీనివాస్ స్వగ్రామంలో 60 శాతమే మాఫీ

బోయిని చంద్రయ్య

రుద్రంగి, ఆగస్టు 26: ప్రభుత్వ మరో విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వగ్రామమైన రుద్రంగి మండల పరిధిలో 3039 మంది రైతులు రుణాలు తీసుకోగా.. 1896 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. మిగిలినవాళ్లు ఎప్పుడు రుణ మాఫీ జరుగుతుందా అని ఎదురుచూస్తున్నారు. రుద్రంగి రైతు బోయిని చంద్రయ్య మాట్లాడుతూ.. 'నాకు 3.12 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. నేను రూ.98,000 లోన్ తీసుకున్నా. మొదటి విడుత జాబితాలో నా పేరు లేదు. అధికారులను అడిగితే తరువాత విడుతల్లో వస్తుందన్నరు. కానీ, మూడు లిస్టుల్లో కూడా నా పేరు రాలేదు. రుణమాఫీ జాబితా గందరగోళంగా ఉన్నది. రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ దానిని విస్మరించింది' అని పేర్కొన్నారు

మాఫీలో మరో నాటకం

మొదటిపేజీ తరువాయి...

సర్వేపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా రైతులను మళ్లీ మభ్యపెట్టేందుకు ప్రభుత్వ ఎత్తుగడ అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రుణమాఫీని సాగదీయడానికో, తప్పించుకునేందుకో చేస్తున్న ప్రయత్నమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రుణమాఫీ వచ్చిందో, రాలేదో తెలుసుకోవడానికి వచ్చిన రైతులతో కిటకిటలాడుతున్న నిజామాబాద్ జిల్లా కోటగిరిలోని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఫైల్)

మళ్లీ సర్వే ఎందుకు?

మొత్తం 42 లక్షల మంది రైతులకు గానూ 22 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రుణ మాఫీ చేసింది. ఇందులో పలు కారణాలతో 5.49 లక్షల మంది రైతులకు మాఫీ కాలేదని స్వయంగా మంత్రి తుమ్మల వెల్లడించారు. ఎంత మందికి రుణమాఫీ కాలేదో, వారికి ఎందుకు కాలేదో ప్రభుత్వం వద్ద సమాచారం ఉంది. అలాంటప్పుడు ఆ సమాచారం ప్రకారం బ్యాంకుల నుంచి మళ్లీ వివరాలు తెప్పించుకొని, తప్పులను సరిచేసి గంటల వ్యవధిలో రుణమాఫీ కానటువంటి రైతులకు మాఫీ చేయొచ్చు. రుణమాఫీ కాని వారి నుంచి ఇప్పటికే ప్రభుత్వం ఫిర్యాదులను స్వీకరించింది. వీటి ఆధారంగా కూడా మాఫీ చేయొచ్చు. కానీ ప్రభుత్వం ఈ రెండు పనులు చేయకుండా మళ్లీ కొత్తగా సర్వే చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే రైతుభరోసా పేరుతో ప్రత్యేక యాప్‌ను రూపొందించి ఆ యాప్‌తో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తారట.

వారికెలా మాఫీ చేశారు?

రుణమాఫీలో భాగంగా బ్యాంకుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా 22 లక్షల మందికి ప్రభుత్వం రుణమాఫీ చేసింది. మాఫీ అయినవారి నుంచి ఇంతకు ముందు ఎలాంటి దరఖాస్తు తీసుకోనప్పుడు, కాని వారి కోసం ఇప్పుడు సర్వే ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వారికి చేసినట్టే తమకూ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సర్వేల పేరుతో రుణ మాఫీలో కోత పెడితే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు.

రుణ చెల్లింపుపై షరతు ఎందుకు?

రుణమాఫీలో భాగంగా రూ. 2 లక్షలకు పైనున్న రుణాలపై ప్రభుత్వం ఆంక్షలు పెట్టింది. రూ. 2 లక్షలకు పైనున్న రుణాన్ని రైతులు చెల్లిస్తే మిగతా సొమ్మును తాము చెల్లిస్తామని పేర్కొన్నది. ఈ షరతుపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. చెప్పినట్టుగా ప్రభుత్వం రూ. 2 లక్షలు మాఫీ చేస్తే పైనున్న రుణాన్ని రైతులే తమ వద్ద డబ్బులున్నప్పుడు కట్టుకుంటారని చెప్తున్నారు. రైతుల నుంచి రుణం వసూలు చేసుకునే బాధ్యత రైతులదేనని అంటున్నారు. అలాంటప్పుడు ఈ కండిషన్ ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెడపై కత్తిపెట్టి పైనున్న రుణం చెల్లించాలనడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తులు బుట్టదాఖలేనా?

రుణమాఫీ కాని రైతుల నుంచి జిల్లాల్లో ప్రత్యేకంగా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ఫిర్యాదులు స్వీకరించింది. లక్షకు పైగా దరఖాస్తులు వచ్చినట్టు తెలిసింది. కొందరు రైతులు ఏఈవోల వద్ద కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా బ్యాంకుల నుంచి రైతుల వివరాలు తీసుకొని వాళ్లకు రుణమాఫీ చేయొచ్చు. కానీ ప్రభుత్వం ఈ సులువైన మార్గాలను పక్కనపెట్టి సర్వేకే మొగ్గు చూపుతున్నది. ఈ నేపథ్యంలో లక్షల్లో స్వీకరించిన దరఖాస్తులన్నీ బుట్టదాఖలైనట్లేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సాగదీత... తప్పించుకునేందుకేనా?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9న ప్రతి రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. బీఆర్ఎస్ పోరాటం, హరీశ్‌రావు సవాల్‌తో దిగొచ్చిన ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎదురుపడ్డ దేవుళ్లపై ఒట్టు పెట్టారు. కానీ ఆ మాటను కూడా నిలబెట్టుకోలేకపోయారు. ఆగస్టు 15 నాటికి రుణ మాఫీ పూర్తి కాలేదని స్వయంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అంగీకరించారు. రేవంత్‌రెడ్డి కూడా రుణమాఫీ కాలేదని ఒప్పుకొన్నారు. దీంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైంది. ఈ నేపథ్యంలో రైతులను మభ్య పెట్టేందుకు ప్రభుత్వం మళ్లీ కొత్త కథను తెరపైకి తీసుకొచ్చింది. సర్వే పేరుతో సాగదీతకు మరో ప్రణాళిక రూపొందించింది.

పై రుణం చెల్లించాక మాఫీ కాకపోతే

రూ. 2 లక్షలకు పైనున్న రుణాన్ని రైతులు చెల్లిస్తే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్తున్నది. అయితే, ప్రభుత్వం చెప్పినట్టుగా అప్పోసప్పో చేసి చెల్లించాక ప్రభుత్వం రుణమాఫీ కాకపోతే పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు రైతుల నుంచి వస్తున్నాయి. మాఫీ అవుతుందన్న గ్యారెంటీ ఏంటని నిలదీస్తున్నారు.

వారికి మాఫీ చేసి.. వీరికి మాత్రం సర్వేనా?

1. రుణమాఫీకి అసలు సర్వే చేయాల్సిన అవసరం ఏమిటి? రైతులు స్వీయ ధ్రువీకరణ ఎందుకు ఇవ్వాలి? దరఖాస్తు ఎందుకు చేయాలి? ఇప్పటికే ప్రభుత్వం కొందరికి రుణమాఫీ చేసింది. వారు ఏ దరఖాస్తు చేశారని మాఫీ చేసింది? ఎలాంటి సర్వే లేకుండానే వాళ్లకు రుణ మాఫీ చేసినప్పుడు ఇప్పుడు ఈ రైతులకు దరఖాస్తు తీసుకోవాల్సిన అవసరం ఏమిటి? సర్వే చేయాల్సిన అవసరం ఏమిటి? ఇప్పటికే రుణమాఫీ అయిన రైతుల మాదిరిగానే వీళ్లకు కూడా రుణ మాఫీ చేయొచ్చు కదా?

2. ఓ రైతుకు బ్యాంకు రుణం ఇచ్చిందంటే అతడికి సంబంధించిన పూర్తి వివరాలు బ్యాంకు వద్ద ఉంటాయి. ఈ డాటా ఆధారంగానే ప్రభుత్వం రుణమాఫీ చేసింది. అలాంటప్పుడు ఇప్పుడు రుణమాఫీ కాని రైతుల నుంచి వివరాల సేకరించాల్సిన అవసరం ఏమిగా? అంటే వీరి వివరాలు బ్యాంకుల వద్ద లేవా? వివరాలు లేకుండానే బ్యాంకులు రైతుకు రుణాలిచ్చాయా? లేదంటే ప్రభుత్వం రుణమాఫీని సాగదీసేందుకు, ఇవ్వకుండా తప్పించుకునేందుకు ఈ డ్రామాను తెరపైకి తీసుకొచ్చిందా?

3. ఇక రూ. 2 లక్షల రుణమాఫీ కావాలంటే ఆపై రుణం చెల్లించాలని ప్రభుత్వం చెబుతున్నది. అసలు రుణ మాఫీకి ఈ కండిషన్ ఎందుకు? ప్రభుత్వం చేస్తానన్న రుణమాఫీ చేయాలి. అంతేకానీ రైతులను రుణం చెల్లించాలని చెప్పే హక్కు ప్రభుత్వానికి ఎక్కడిది? ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తే పైన ఉన్న రుణం రైతుకు ఇష్టమున్నప్పుడు చెల్లించుకుంటాడు. ఒక విధంగా చెప్పాలంటే రుణం వసూలు చేసుకునే బాధ్యత బ్యాంకులది. దీనితో ప్రభుత్వానికేం సంబంధం. ఈ కండిషన్ రుణమాఫీ ఎగ్గేట్టొందుకేనా?

4. రుణమాఫీ కానటువంటి రైతుల నుంచి ఇప్పటికే ప్రభుత్వం ఫిర్యాదులు స్వీకరించింది. వీటి ఆధారంగా రైతుల వివరాలను బ్యాంకుల నుంచి తెప్పించుకొని మాఫీ చేయొచ్చు. ప్రభుత్వం ఆ పని చేయకుండా మళ్లీ కొత్తగా సర్వే చేసేందుకు నిర్ణయించింది. అంటే మొన్నటి వరకు రైతుల నుంచి తీసుకున్న ఫిర్యాదులు ఉత్తుత్తివేనా. లక్షల ఫిర్యాదులను చెత్త బుట్టలో వేసినట్లేనా?

70 కోట్లకుగానూ 42 కోట్లే మాఫీ

హనుమకొండ సబర్బన్, ఆగస్టు 26: ఆసియా ఖండంలోనే అతిపెద్దదిగా ప్రసిద్ధికెక్కిన సహకార సంఘమిది.జిల్లాలోనే ఎక్కువగా సభ్యులు కలిగిన ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘంలోని రైతులకు రుణమాఫీలో అన్యాయం జరిగింది. సొసైటీ పరిధిలో 14 పాత గ్రామపంచాయతీలు, పది కొత్త గ్రామపంచాయతీలతో కలిపి మొత్తం 24 గ్రామాల పరిధిలో 7641మంది రైతు సభ్యులున్నారు. ఇందులో ప్రభుత్వం విధించిన నిబంధనల మేరకు 6662మంది రుణమాఫీకోసం అర్హులుగా గుర్తించిన సొసైటీ ప్రభుత్వానికి జాబితాను పంపించింది. ఇదీగాకుండా మండలంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ శాఖలు కూడా కొనసాగుతున్నాయి. అయితే మండలంలో మెజార్టీ రైతులు ముల్కనూరు సొసైటీ నుంచే రుణాలు తీసుకున్నారు. ఇందులో లక్షలోపు రుణం అర్హులు 3526 మంది ఉండగా 3022మందికి మాఫీ లభించింది. రెండవ విడుతలో లక్షయాభైవేయిలు లోపు వారిలో 1533మంది రైతులు ఉండగా 1142మందికి మాఫీ వచ్చింది. ఇక రెండు లక్షల లోపు రుణమాఫీ అయిన మూడవ విడుతలో 985మంది అర్హులుగా ఉండగా కేవలం 577మందికే రుణమాఫీ అయినట్లుగా అధికారులు చెబుతున్నారు. సొసైటీ పంపించిన ప్రతిపాదనల ప్రకారం రూ.70.23కోట్లు రైతులకు రుణమాఫీ రావాల్సి ఉండగా కేవలం రూ.42.40 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇంకా రూ. 27.65 కోట్లు రైతులకు రావాల్సి ఉన్నది.

కాలయాపనకేనా రైతుభరోసా యాప్

- రైతు జేఏసీ నేత లింగారెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 26: కాలయాపన కోసమే ప్రభుత్వం రైతుభరోసా యాప్ తీసుకొచ్చిందని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ రైతు ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యుడు ఇట్టడి లింగారెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన ఆర్మూర్‌లో మీడియాతో మాట్లాడారు. యాప్‌లో రైతులు స్వీయ ధ్రువీకరణ ఇవ్వాలనడం దారుణమని అన్నారు. సిద్దుల గుట్ట సాక్షిగా 2 లక్షలలోపు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ తరువాత రైతులను దారుణంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. అర్హులందరి రుణాలను మాఫీ చేయాలని కోరారు. సెప్టెంబర్ 15లోగా రుణ సంకెళ్లు తెంచకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ సభ్యులు ప్రభాకర్, యాదగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆ ఊళ్లో ఇద్దరికే రుణమాఫీ!

- జనగామ జిల్లా నిడిగొండ పీఏసీఎస్‌లో వెలుగులోకి..
- అప్పు చెల్లించినా బాకీ ఉన్నట్టుగా తప్పుడు రికార్డులు
- ఫోర్జరీ సంతకాలతో రైతుల పేరిట రుణాలు
- సీఈవో నిర్వాకంతో మాఫీకి దూరంగా 552 మంది

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామ వ్యూ

జనగామ, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలో ఇద్దరు రైతులకే రుణమాఫీ అయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే 554 మంది రైతులకు రూ.2.55 కోట్లు మాఫీ కావాల్సి ఉండగా కేవలం ఇద్దరి ఖాతాల్లో రూ.87 వేలు జమ అయ్యాయి. పాత అప్పు పూర్తిగా చెల్లించినా, ఇంకా బకాయి ఉన్నట్టు రికార్డుల్లో చూపడంతో 552 మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు. నిడిగొండ పీఏసీఎస్ సీఈవో నిర్వాకం, అధికారుల పర్యవేక్షణ లోపంతో 552 మంది రైతులు ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో ఉన్నారు. నిడిగొండ పీఏసీఎస్ పరిధిలో 3,760 మంది రైతులు సభ్యులుగా ఉండగా, అందులో కొందరు రైతులు రుణం తీసుకొని చెల్లించినప్పటికీ బాకీ ఉన్నట్టు, మరి కొందరు అప్పు తీసుకోకపోయినా వారి పేరిట బాకీ ఉన్నట్టు సీఈవో తప్పుడు రికార్డులు సృష్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీఏసీఎస్ పాలకవర్గం, సీఈవో కుమ్మక్కై తప్పుడు రికార్డులు సృష్టించి రూ.లక్షలు స్వాహా చేయడంతో పలువురు రైతులు రుణ మాఫీకి దూరమయ్యారు. దీంతో రైతులు పాలకవర్గంతోపాటు సీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒకే ఆధార్ నంబర్‌పై మరొకరికి రుణం

నిడిగొండ గ్రామానికి చెందిన వూరడి చంద్రమౌళి ఆధార్‌కార్డు నంబరుపై ఆయనతో పాటు మరొకరికి రూ.10 వేలు రుణం ఇచ్చినట్టు పీఏసీఎస్ రికార్డుల్లో ఉన్నది. పదేండ్ల క్రితమే అతడు అప్పు మొత్తం చెల్లించి నోడ్యూస్ సర్టిఫికెట్ తీసుకొని గ్రామంలోని ఏపీజీవీబీ బ్యాంకులో రూ.1.60 లక్షలు రుణం తీసుకున్నాడు. ఇద్దరికి ఒకే ఆధార్ నంబర్ ఉండటంతో ప్రస్తుతం అతడి పంట రుణం మాఫీ కాలేదు.

డబ్బులు రికవరీ చేయాలి

రైతుల పేరిట ఫోర్జరీ సంతకాలు చేసి లక్షలు దండుకున్న పీఏసీఎస్ సీఈవో రాజయ్య నుంచి డబ్బులు రికవరీ చేయాలి. సీఈవో అక్రమాలకు తెరలేపాడు. సాంకేతికంగా రుణమాఫీ వర్తించకుండా నష్టం చేశాడు. సీఈవోపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు చేస్తాం.

- కమలాకర్‌రెడ్డి, రైతు, నిడిగొండ, రఘునాథపల్లి, జనగామ జిల్లా

అధికారుల వల్లే మాఫీ కాలేదు

మాఫీకి అర్హత ఉన్నా, పీఏసీఎస్‌లో అప్పు తీసుకోకున్నా తీసుకున్నట్టు రికార్డుల్లో చూపించడంతో నాకు మాఫీ వర్తించలేదు. రైతుల పేరిట దొంగ సంతకాలు పెట్టి అప్పు ఇచ్చినట్టు రికార్డులు సృష్టించిన సీఈవో రూ.కోట్లు దండుకున్నాడు. ప్రభుత్వం స్పందించి సీఈవోపై చర్యలు తీసుకోవాలి. రైతులకు బేషరతుగా మాఫీ చేయాలి.

-వూరడి చంద్రమౌళి, రైతు, నిడిగొండ, రఘునాథపల్లి, జనగామ జిల్లా

గురుకులం కన్నా జైలు నయం!

- కారాగారాల టైంటేబుల్ కన్నా దారుణంగా పనివేళలు
- ఉదయం నుంచి రాత్రి వరకు 16 గంటల షెడ్యూల్
- తరగతుల్లోనే విద్యార్థుల నిద్ర.. బుర్రకెక్కని పాఠాలు

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గురుకుల సొసైటీలన్నింటికీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఖరారు చేసిన పనివేళలు జైలు మాన్యువల్ కన్నా దారుణంగా ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జైల్లో ఖైదీలకు వర్తింపజేసేట్టు విద్యార్థులకు టైం టేబుల్ అమలు చేయటంపై అసహనం వ్యక్తం అవుతున్నది. ఉదయం 5 గంటలకే నిద్రలేపి.. రాత్రి 9 గంటల వరకు విశ్రాంతి లేకుండా, వ్యక్తిగత సమయం ఇవ్వకుండా చేయటంతో విద్యార్థులు అలసిపోతున్నారు. దాంతో తరగతి గదుల్లో క్లాసులు జరుగుతుండగానే నిద్ర వచ్చేస్తున్నది. అటు పాఠాలు కూడా బుర్రకు ఎక్కడం లేదు. ప్రభుత్వం మార్చిన పనివేళలతో విద్యార్థులు విపరీతమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. టైం టేబుల్ అమలు ఆచరణ సాధ్యం కాదని పేర్కొంటున్నారు. అనేక గురుకులాలు ప్రైవేటు భవనాల్లోనే ఉన్నాయని, అందులో బాత్రూంలు, నీళ్లు, వంటగది తదితర వసతులు సరిపడా లేవని, బ్రేక్‌ఫాస్ట్ రెడీ అయ్యే వరకు విద్యార్థులను పరిగడుపున తరగతి గదిలో కూర్చొబెట్టి క్లాస్ చెప్పాల్సి వస్తున్నదని, తిరిగి క్లాస్ మధ్యలో బ్రేక్‌ఫాస్ట్‌కి పంపాల్సిన పరిస్థితి నెలకొన్నదని వివరిస్తున్నారు. విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనై, మానసిక స్థితిపై దెబ్బ పడుతున్నదని తెలిపారు. ప్రభుత్వం ఈ పనివేళల ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి.

పనివేళలను శాస్త్రీయంగా నిర్ణయించాలి

గురుకుల పాఠశాలల పనివేళలు విద్యార్థుల మానసిక వికాసానికి తగిన విధంగా ఉండాలని, టీచర్లు ఒత్తిడి లేకుండా పనిచేసేలా శాస్త్రీయంగా నిర్ణయించాలని టీఎస్ యూటీఎఫ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. 'గురుకులాల పనివేళలు–విద్యార్థులపై ప్రభావం' అంశంపై తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. ఫెడరేషన్ అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షతన కొనసాగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు అనుగుణంగా పనివేళలను సవరించాలని డిమాం డ్ చేశారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, కోశాధికారి లక్ష్మిరెడ్డి, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి పాల్గొన్నారు.

గురుకులాల కామన్ టైంటేబుల్

- ఉదయం 5–5.15 గంటలకు నిద్ర లేవాలి.
- 5.15–6 గంటల వరకు యోగ, వ్యాయామం,
- 6–7 గంటల వరకు కాలకృత్యాలు
- 7–7.45 గంటల వరకు అల్పాహారం
- 7.45–8 గంటల వరకు కిచెన్ ఇన్‌స్పెక్షన్
- 8–8.15 గంటల వరకు ప్రేయర్
- 8.15 గంటల నుంచి ప్రతి 45 నిమిషాల చొప్పున 11.15 గంటల వరకు 4 క్లాస్‌ల నిర్వహణ (10 నిమిషాల స్వల్ప విరామం)
- 11.25 గంటలకు క్లాస్‌లు ప్రారంభం మధ్యాహ్నం 12.45 గంటల వరకు 2 క్లాస్‌ల నిర్వహణ.
- మధ్యాహ్నం 12.45–1.30 గంటల వరకు 5, 6, 7 తరగతుల విద్యార్థులకు లంచ్
- 1.45–2.30 గంటల వరకు 5, 6, 7 తరగతుల విద్యార్థులకు పర్సనల్ టైం
- 12.45–1.25 గంటల వరకు 8వ తరగతి నుంచి ఆ పైతరగతులకు 7వ పీరియడ్
- 1.25–2.15 గంటల వరకు లంచ్
- 2.15–2.30 గంటల వరకు పైతరగతుల విద్యార్థులకు పర్సనల్ టైం
- మధ్యాహ్నం 2.30–4.30 గంటల వరకు క్లబ్ యాక్టివిటీస్, ప్రాజెక్ట్స్, కోకరిక్యులర్ యాక్టివిటీస్
- సాయంత్రం 4.30–4.45 గంటల వరకు స్నాక్స్
- సాయంత్రం 4.45–5.45 గంటల వరకు స్పోర్ట్స్
- సాయంత్రం 5.45–6 గంటల వరకు రోల్‌కాల్
- 6.15 వరకు పర్సనల్ టైం
- రాత్రి 6.15–7 గంటల వరకు డిన్నర్
- రాత్రి 9 గంటల వరకు స్టడీ అవర్స్
- ఆ తర్వాత విద్యార్థులకు నిద్రకు ఉపక్రమించాలి.

దర్శన్ రాజభోగాలకు డీకేనే బాధ్యుడు

- బీజేపీ నేత అశోక ఆరోపణ

బెంగళూరు, ఆగస్టు 26: కన్నడ నటుడు దర్శన్‌కు జైలులో విలాసవంతమైన సౌకర్యాలు కల్పించినట్టు వచ్చిన వార్తలపై బీజేపీ నేత అశోక సోమవారం విమర్శలు ఎక్కుపెట్టారు. ఇందుకు డిప్యూటీ సీఎం, కాంగ్రెస్ నేత శివకుమార్ బాధ్యుడని ఆరోపించారు. శివకుమార్ జైల్లో దర్శన్‌ను కలిసి అన్ని రకాలుగా సాయం చేయడానికి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కేసులో ఆధారాల విధ్వంసానికి, సాక్షుల బెదిరింపుకు కుట్ర జరుగుతున్నదని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ఆరోపించారు. మరోవైపు ఈ ఘటనకు సంబంధించి ఏడుగురు జైలు సిబ్బందిని సస్పెండ్ చేశామని.. జైలులో విచారణ జరపాలని హోంమంత్రిని ఆదేశించానని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తెలిపారు.

సర్కారుపై పోరుకు గురుకుల విద్యాజేఏసీ

- 11 సంఘాలు కలిసి ఏర్పాటు
- తక్షణమే సమస్యల పరిష్కరించాలని అల్టిమేటం

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): బదిలీలు, పదోన్నతుల్లో